సాక్షి
ఖమ్మం
గురువారం । 24 । జూలై । 2025



ఖ్యాతి పెంచేలా 'ఎర్త్ సైన్సెస్'

కొత్తగూడెంలో ఏర్పాటవుతున్న ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ తెలంగాణ ఖ్యాతిని పెంచేలా ఉంటుందని మంత్రి తుమ్మల తెలిపారు. 8లో



దంత సేవలు అంతంతే..

జిల్లా పెద్దాస్పత్రి దంత విభాగంలో అవసరమైన వసతులు లేక, ఎండీ స్థాయి డాక్టర్లను నియమించక సరైన వైద్యం అందడంలేదు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేట, దానవాయిగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక దానవాయిగూడెంలో 1, 59, 60డివిజన్ల ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తారు. అనంతరం వైరాలో జరిగే టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మహాసభలో పాల్గొంటారు. ఆతర్వాత ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడు, ఊటవాగుతండా, మంగలిగూడెం, కొత్తూరులో సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

వైద్యసేవలు ఎలా అందుతున్నాయి?



మహిళతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని పాలియేటివ్ కేర్(ఉపశమన) సెంటర్‌లో వైద్యసేవలపై డీఎంహెచ్ఓ బి.కళావతి బాయి ఆరా తీశారు. సెంటర్‌ను బుధవారం తనిఖీ చేసిన ఆమె దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అందుతున్న చికిత్స, అందుబాటులో ఉన్న మందుల వివరాలు తెలుసుకున్నారు. అలాగే, వైద్యులు, సిబ్బంది పనితీరుపై సమీక్షించిన ఆమె దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్స చేయడమే కాక మానసిక ప్రశాంతత కలిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆతర్వాత అసంక్రమిత వ్యాధులపై అధికారులతో డీఎంహెచ్ఓ సమీక్షించారు. జిల్లాలో కేన్సర్, మధుమేహం, బీపీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు, వారికి అందుతున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్దాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ నరేందర్, డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్, వివిధ విభాగాల వైద్యులు ఎల్.కిరణ్‌కుమార్, రామారావు, ఉద్యోగులు రవికిషోర్, నందగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందుపై నిషేధం విధించాలి

లోక్‌సభలో ఎంపీ రఘురాంరెడ్డి



ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: పంటల్లో కలుపు నివారణకు వినియోగిస్తున్న అత్యంత విషపూరితమైన పారాక్వాట్ మందును నిషేధించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. పార్లమెంట్‌లో బుధవారం 377 నిబంధన కింద ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. కలుపు నివారణకు ఉపయోగించే ఈ మందును క్షణికావేశంలో తాగుతున్న రైతులు, ఇతరులు ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. సరైన చికిత్స లేక పలువురు మృతి చెందుతున్నందున కేంద్రప్రభుత్వం నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, పారాక్వాట్‌కు ప్రత్యామ్నాయ మందు అందుబాటులోకి తీసుకొచ్చి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను ఎంపీ కోరారు.

సీజన్‌కు సరిపడా ఎరువులు



షాప్ వద్ద స్టాక్ బోర్డును పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

కామేపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే పంటలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య స్పష్టం చేశారు. కామేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రతీ షాప్ వద్ద ఎరువుల స్టాక్ వివరాలతో బోర్డు ఏర్పాటుచేయడమే కాక ప్రతీ అమ్మకాన్ని పీఓఎస్ మిషన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎవరైనా ఎరువులను బ్లాక్ చేయాలని ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అంతేకాక గుళికల యూరియాకు బదులు నానో యూరియా ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, ఎరువుల కొరత ప్రచారంతో రైతులు ఆందోళన చెందవద్దని డీఏఓ తెలిపారు. ఏఓ తారాదేవి, ఏఈఓలు జగదీశ్వర్, జ్ఞాన దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతటా అప్రమత్తం

జిల్లాలో రెండు రోజులుగా వర్షం

- అలుగు పోస్తున్న వైరా రిజర్వాయర్, కట్టలేరు
- భారీ వర్షసూచనతో అలర్ట్ అయిన జిల్లా యంత్రాంగం
- కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు



ఖమ్మంలో మున్నేరు పాత వంతెన వద్ద వరద ఉధృతి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వర్షాలు, ఆపై వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని కలెక్టరేట్‌లో 1077 టోల్‌ఫ్రీ నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. మరోవైపు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని పాలేరు, వైరా రిజర్వాయర్లలోకి ఇన్‌ఫ్లో పెరగగా వైరా రిజర్వాయర్ అలుగు పోస్తోంది. జిల్లాలో బుధవారం సగటు 5.4 సెం.మీ. వర్షపాతం, మధిరలో అత్యధికంగా 11.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, ఎర్రుపాలెం మండలంలో 9.6, కూసుమంచి మండలంలో 8.2 సెం.మీ. నమోదైందని అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది సీజన్‌లో ఇదే పెద్ద వాన కాగా, గత ఏడాది మున్నేటికి వచ్చిన వరదల దృష్ట్యా అధికార యంత్రాంగం ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు చేపడుతోంది.

జూలైలో జోరుగా..

ఈ వానాకాలం సీజన్‌లో జూన్ నెలలో వరుణుడు కరుణించలేదు. ఆ నెల చివరలో మాత్రం వర్షాలు కురిశాయి. గత ఏడాది జూన్‌లో 12.4 సెం.మీ. గాను 19.7 సెం.మీ. వర్షపాతం నమోదైతే ఈ ఏడాది జూన్‌లో 13.1 సెం.మీకు గాను 12.3 సెం.,మీ.గానే నమోదైంది. ఇక గత జూలైలో 24.9 సెం.మీ. వర్షపాతానికి గాను 30.3 సెం.మీ., ఈ ఏడాది ఇప్పటి వరకు 17.5 సెం.మీ. సగటు వర్షపాతంలో 22.8 సెం.మీ. నమోదు కావడం విశేషం.

ప్రాజెక్టుల్లోకి వరద

నిన్నామొన్నటి వరకు కళ తప్పిన పాలేరు రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ రిజర్వాయర్ నీటిమట్టం 23 అడుగులు కాగా.. ప్రస్తుతం 15 అడుగుల మేర నీరు ఉంది. సాగర్ నుంచి వస్తున్న 1,446 క్యూసెక్కులు, చుట్టుపక్కల నుంచి 500 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అంతేకాక సాగర్ నుంచి ఇన్‌ఫ్లో పెంచనుండడంతో రెండో జోన్ ఆయకట్టుకు 1,010 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. అలాగే, మిషన్ భగీరథ ప్రాజెక్టుకు 135 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. ఇక వైరా రిజర్వాయర్‌లోకి 1,670 క్యూసెక్కుల వరద వస్తుండగా 18.4 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరి అలుగు పోస్తోంది. లంకాసాగర్ ప్రాజెక్టులోకి 192 క్యూసెక్కులు, బేతుపల్లి చెరువులోకి 329 క్యూసెక్కుల వరద చేరుతోంది. ఎర్రుపాలెం మండలంలోని కట్టలేరుకు 119 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. అయితే, తక్కెళ్లపాడు-బనిగండ్లపాడు మధ్య కల్వర్టుపైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిపివేశారు. అలాగే, ఖమ్మంలోని ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యామ్, కాల్వొడ్డులోని పాత వంతెన చప్టా వద్ద వరద పెరిగి దిగువకు పారుతోంది. దీంతో అధికారులు మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వర్షపాతం వివరాలను ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

అధికార యంత్రాంగం సన్నద్ధం..

భారీ, అతిభారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో అధికారులు అన్నివిధాలుగా సన్నద్ధమయ్యారు. గత ఏడాది మూడు గంటల వ్యవధిలోనే 39 సెం.మీ. వర్షపాతం నమోదై మున్నేటిని వరద ముంచెత్తిన విషయం విదితమే. ఈసారి అలాంటి ఉపద్రవం ఎదురైనా ఎదుర్కొనేలా ముందు జాగ్రత్త చర్యల్లో నిమగ్నమయ్యారు. ఆపదలో చిక్కుకున్న వారు ఫోన్ చేసేలా టోల్‌ఫ్రీ నంబర్ 1077తో కలెక్టరేట్‌లో 24గంటల పాటు కొనసాగేలా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. అంతేకాక మున్నేరు పరీవాహక ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేసి, వరద ముంచెత్తితే తరలించేలా పునరావాస కేంద్రాలను గుర్తించారు.

ముసురుకుంది..

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎర్రుపాలెం మండలంలోని కట్టలేరుకు వరద పెరగగా తక్కెళ్లపాడు - బనిగండ్లపాడు మధ్య రాకపోకలు నిలిచాయి. అలాగే, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇక నిన్న మొన్నటి వరకు వెలవెలబోయిన చెరువుల్లోకి నీరు చేరుతోంది. మొత్తం 984 చెరువులకు గాను 39 అలుగు పోస్తుండగా.. 122 పూర్తిగా, 180 చెరువులు 50 – 75 శాతం మేర నిండాయి.



వైరాలో అలుగు పోస్తున్న రిజర్వాయర్



ఎర్రుపాలెం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కట్లేరు

హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, తాజా ఆహారం అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యాన 122 హాస్టళ్లలో 13,876 మంది వసతి పొందుతున్నారని పేర్కొన్నారు. ఇవే కాక గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచిన నేపథ్యాన నాణ్యమైన భోజనం అందేలా పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. ఈ విషయంలో జిల్లా అధికారులను ప్రత్యేకంగా నియమించగా, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఏటీసీ కోర్సులతో ఉపాధి

ఏటీసీలుగా అప్‌గ్రేడ్ అయిన ఐటీఐల్లో అందుతున్న కోర్సులతో యువతకు ఉపాధిపై భరోసా లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని ఏటీసీలో కొత్తగా ఆరు కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతుండగా, ఇంకా 128 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి అర్హత ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎరువులపై ఫిర్యాదులకు ప్రత్యేక సెల్

రైతులు 1077, 90632 11298 నంబర్లకు ఫోన్ చేయాలని సూచన

ఖమ్మంవ్యవసాయం: ఎరువుల కొరత, ఇతర సమస్యలపై రైతులు ఫిర్యాదు చేసేలా కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. రైతులకు ఏ ఫిర్యాదు ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్ 1077 లేదా 90632 11298కు ఫోన్ చేయాలని సూచించారు. లేదంటే రాష్ట్రస్థాయిలో 89777 41771 నంబర్‌కైనా ఫోన్ చేయొచ్చని తెలిపారు. జిల్లాలో సాగవుతున్న పంటలకు యూరియా 41వేల మెట్రిక్ టన్నులు, డీఏపీ 26,464 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 20,857 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 88వేల మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 6,780 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేసి, అందుకు అనుగుణంగా అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఇదే సమయాన డీలర్లు కృత్రిమ కొరత సృష్టించకుండా తనిఖీలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

'నవోదయ'లో క్లస్టర్ స్పోర్ట్స్ మీట్

హాజరైన వివిధ జిల్లాల నవోదయ విద్యార్థులు

కూసుమంచి: మండలంలోని పాలేరులో జవహర్ నవోదయ విద్యాలయలో బుధవారం క్లస్టర్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. తొలుత ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసులు క్రీడా పతాకాన్ని ఎగురవేయగా, క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటడం ద్వారా ఉన్నత స్థాయికి చేరొచ్చని చెప్పారు. ఇక్కడ పోటీల్లో ప్రతిభ చాటిన 250మందిని రీజినల్ స్థాయికి ఎంపికచేస్తామని తెలిపారు.

345 మంది క్రీడాకారులు

పాలేరు నవోదయలో మొదలైన క్లస్టర్ స్థాయి పోటీలకు పాలేరుతో పాటు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నవోదయ విద్యాలయాల విద్యార్థులు 345 మంది హాజరయ్యారు. ఇందులో 183 మంది బాలురు, 162 మంది బాలికలు ఉన్నారు. వీరికి అండర్–14, 17, 19 విభాగాల్లో బ్యాడ్మింటన్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, ఖో–ఖో, యోగా పోటీలు నిర్వహిస్తుండగా గురువారంతో ముగియనున్నాయి.



క్రీడా పతాకాన్ని ఎగురవేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు



ఖో–ఖో పోటీలో తలపడుతున్న బాలికలు

విద్యాశాఖలో సమస్యలెన్నో...

- ప్రారంభానికి నోచుకోని సైన్స్ మ్యూజియం
- టీచర్ల సర్దుబాటుపై అనుమానాలు
- నేడు విద్యాశాఖపై సమీక్షించనున్న కార్యదర్శి యోగితారాణా



డీఈఓ కార్యాలయం

ఖమ్మం సహకారనగర్: జిల్లా విద్యాశాఖ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గత నాలుగైదేళ్లుగా సరైన పర్యవేక్షణ లేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు సైతం అందటం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

డీఈఓగా అదనపు బాధ్యతలే...

విద్యాశాఖలో కీలక అధికారి అయిన డీఈఓ పోస్టు ఏళ్లుగా ఖాళీగా ఉంటోంది. గతంలో డైట్ లెక్చరర్ సోమశేఖరశర్మ ఎఫ్ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జి)గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన రిటైర్ అయ్యాక డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. అయితే, సత్యనారాయణ కూడా ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనుండడం గమనార్హం. దీంతో ఈసారైనా రెగ్యులర్ డీఈఓను నియమిస్తారా, లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. అంతేకాక విద్యాశాఖలో మరో కీలక పోస్టు అకడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంఓ) పోస్టు సైతం ఖాళీగా ఉండడం విద్యాశాఖ పనితీరుపై ప్రభావాన్ని చూపిస్తోంది.

ముందుకు సాగని మ్యూజియం

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సైన్స్ మ్యూజియం మంజూరై పదేళ్లు దాటింది. నిధులు కూడా కేటాయించినా ఎడతెగని జాప్యం అనంతరం రెండేళ్ల క్రితం పాత డీఈఓ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. అన్ని పరికరాలు సమకూరినా కొన్ని వసతులు లేవని చెబుతూ మ్యూజియంను ప్రారంభించకపోవడం గమనార్హం.

నేడు నాలుగు జిల్లాల అధికారులతో సమీక్ష

విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా బుధవారం ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చారు. తొలిరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించగా గురువారం ఖమ్మం రానున్నారు. పలుచోట్ల పాఠశాలలు, గురుకులాలను తనిఖీ చేయనున్న ఆమె సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల అధికారులతో విద్యాశాఖపై సమీక్షిస్తారు. బడిబాటలో విద్యార్థుల నమోదు, ఉపాధ్యాయుల సర్దుబాటు, యూనిఫాం పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై యోగితారాణా సమీక్షించనున్న నేపథ్యాన అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

అందరికీ అందని యూనిఫాం

విద్యాసంవత్సరం ప్రారంభమై నెలన్నర కావొస్తున్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండో జత యూనిఫామ్ అందలేదు. కొందరికి మొదటి జత కూడా అందలేదని తెలుస్తోంది. అయితే, రెండు జతల యూనిఫామ్‌ను ఈనెల 15వ తేదీ నాటికి ఇవ్వాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇటీవల ఆదేశించినా ఫలితం కానరాలేదు. ఇక ఈ ఏడాది కొత్తగా రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్‌లో పాఠశాలను ప్రారంభించడంతో పాటు గతంలో మూతబడిన వాటిలో 14 స్కూళ్లను తెరిచారు. బడిబాటతో మంచి ఫలితాలు వచ్చాయని, విద్యార్థులు చేరారంటూ ఈ బడులను తెరిచినా.. విద్యార్థులకు గురుకులాల్లో సీట్లు రావడం, కొందరు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లడంతో కొన్ని మూతపడే స్థితికి చేరాయి. ఇక సబ్జెక్టు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రయత్నాలు మొదలుపెట్టినా ఓ కొలిక్కి రాలేదు. ఇంతలోనే పైరవీలు మొదలయ్యాయనే ప్రచారం అర్హులైన ఉపాధ్యాయుల్లో ఆందోళనకు కారణమవుతోంది. వీటన్నింటికీ తోడు జూనియర్లను ఎంఈఓలుగా నియమించారని కొందరు సీనియర్ హెచ్‌ఎంలు ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేయడం జిల్లాలో విద్యాశాఖ పనితీరుకు అద్దం పడుతోంది.

మహిళల చిరునవ్వులే ఆశీర్వాదాలు

- అందుకే అన్ని పథకాలు అతివల పేరుతోనే...
- 'మహాలక్ష్మి' సంబురాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల చిరునవ్వులే తమ ప్రభుత్వానికి ఆశీర్వాదాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలో మహిళలకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా ఖమ్మం కొత్త బస్టాండ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సంబురాల్లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి నుంచి ఉచిత ప్రయాణంపై అభిప్రాయాలు కోరగా మహిళలు అనిత, జ్యోతి, విద్యార్థిని శ్వేత మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణంతో నెలకు సగటును రూ.3 వేల వరకు ఆదా అవుతున్నాయని తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలోనే 2023 డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని అన్నారు. చిరు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే మహిళలకు ఇది ఎంతో ఉయోగపడుతోందని చెప్పారు. అలాగే, గ్యాస్ సిలిండర్ రాయితీ ఇవ్వడమే కాక ఇందిరమ్మ ఇళ్లు, సోలార్ ప్లాంట్లు, బస్సులు మహిళల పేరిటే ఇస్తున్నామని తెలిపారు. కాగా, ఖమ్మంలో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటుండగా, హైదరాబాద్‌కు దీటుగా కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ చిరుద్యోగాలు చేసే మహిళలు, విద్యార్థినులకు ఉచిత ప్రయాణంతో డబ్బు ఆదా అయి కుటుంబం ఎదగడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రి

రఘునాథపాలెం మండలం మూలగూడెం గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు ఏర్పాటుచేసిన బస్సు సర్వీస్‌ను ఖమ్మం కొత్త బస్టాండ్ వద్ద మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈక్రమాన అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పలువురు మహిళలతో కలిసి టికెట్ కొనుగోలు చేసిన తుమ్మల కొద్దిదూరం ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, ఖమ్మం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్, డిపో మేనేజర్ దినేష్‌కుమార్, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.





మహిళకు బహుమతి అందజేస్తున్న మంత్రి తుమ్మల, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్టీసీ ఆర్‌ఎం సరిరామ్(ఇన్‌సెట్) బస్సులో టికెట్ కొనుగోలు చేస్తున్న మంత్రి నాగేశ్వరరావు

ఏసీబీ డీఎస్పీకి అవార్డు

ఖమ్మం క్రైం: ఉమ్మడి జిల్లా ఏసీబీ డీఎస్పీ రమేష్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. లంచం తీసుకుంటున్న ఉద్యోగులను అరెస్ట్ చేయడంతో పాటు లంచం అడిగిన ఉద్యోగుల వివరాలు ఏసీబీకి ఇచ్చేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తుండడంతో ఆయనను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీజీపీ చేతుల మీదుగా ఆయన హైదరాబాద్‌లో అవార్డు స్వీకరించారు.

కల్లూరుకు సబ్ కలెక్టర్ హోదా!

ఐఏఎస్ అధికారి అజయ్ నియామకం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం ప్రజలకు క్షేత్రస్థాయిలో విస్తృత సేవలు అందేలా పలు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లాల విభజన సమయాన సబ్ డివిజన్‌గా అప్‌గ్రేడ్ అయిన కల్లూరుకు సబ్ కలెక్టర్ హోదా అవసరమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపాదించారు. దీంతో కల్లూరు డివిజన్(ఆర్డీఓ)ను సబ్ కలెక్టర్ హోదాకు అప్‌గ్రేడ్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్‌తో పాటు వివిధ జాతీయ రహదారుల నిర్మాణం ఈ పరిధిలో జరుగుతుండడంతో మెరుగైన పర్యవేక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు.

సబ్ కలెక్టర్‌గా అజయ్‌యాదవ్

కల్లూరును ఆర్డీఓ స్థాయి నుంచి అప్‌గ్రేడ్ చేయడమే కాక సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించింది. 2023 బ్యాచ్ ఐఏఎస్‌లకు బుధవారం పోస్టింగ్ ఇవ్వగా, అజయ్ యాదవ్‌ను ఇక్కడకు కేటాయించారు. బిహార్ రాష్ట్రంలోని ఛాప్రాకు చెందిన ఆయన చెన్నైలోని అలగప్ప కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఇండస్ట్రియల్ బయో టెక్నాలజీలో బీటెక్ పూర్తిచేశారు. ఆతర్వాత ఆంత్రోపాలజీని ఐచ్ఛికంగా ఎంచుకుని సివిల్స్‌కు సిద్ధం కావడం మొదలుపెట్టారు. పలుమార్లు మెయిన్స్ దాటి ఇంటర్వ్యూ వరకు చేరినా అజయ్‌కు ఫలితం దక్కలేదు. ఆపై ఏడో ప్రయత్నంలో సివిల్స్‌కు అర్హత సాధించిన ఆయనను తెలంగాణ కేడర్‌కు కేటాయించారు.

భద్రాచలం సబ్ కలెక్టర్‌గా మ్రిణాల్ శ్రేష్ఠ

భద్రాచలం సబ్ కలెక్టర్‌గా 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మ్రిణాల్ శ్రేష్ఠ నియమితులయ్యారు. ఆయన గతంలో ఖమ్మంలో ట్రెయినీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. భద్రాచలంలో గోదావరి ముంపు నుంచి రక్షణకు కరకట్ట నిర్మాణం, ఆలయ మాడవీధుల విస్తరణ పనులు జరగనుండడంతో సుమారు ఆరేళ్ల అనంతరం సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించినట్లు తెలుస్తోంది.

సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి

కొణిజర్ల: వర్షాలు కురుస్తున్న నేపథ్యాన సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆమె పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశమయ్యారు. రహదారుల వెంట, డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోకుండా శుభ్రం చేయించడమే కాక బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని తెలిపారు. అలాగే, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి సూచించారు. ఆతర్వాత వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు చేయాల్సిన ఏర్పాట్లు, తాగునీటి సరఫరాలో జాగ్రత్తలపై డీపీఓ సూచనలు చేశారు. ఎంపీడీఓ ఉపేంద్రయ్య, ఏపీఓ అమ్మజాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత

క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి బీమా చెక్కు



బీమా చెక్కు అందజేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఏప్రిల్ 1న మృతి చెందిన కానిస్టేబుల్ కృష్ణ కుటుంబానికి బీమా మంజూరైంది. ఈమేరకు ఆయన కుటుంబీకులకు రూ.8లక్షల చెక్కును బుధవారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వరదలో చిక్కుకున్న ఏఓ కారు

గంట పాటు శ్రమించి బయటకు తీసిన స్థానికులు



కారుకు తాళ్లు కట్టి లాగుతున్న స్థానికులు

కారేపల్లి: మండలంలోని కారేపల్లి–కొత్తగూడెం రైల్వే మార్గంలో గాదెపాడు అండర్ బ్రిడ్జి వద్ద బుధవారం కురిసిన వర్షానికి ఆరు అడుగుల మేర నీరు నిలిచింది. ఈక్రమాన సింగరేణి ఏఓ బి.అశోక్‌కుమార్ వివిధ గ్రామాల్లో పంటలు పరిశీలించి కారులో బస్వాపురం నుంచి చర్లపల్లి, గాదెపాడు రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా వస్తున్నారు. ఈక్రమంలో బ్రిడ్జి వద్ద వరదలో కారు నిలిచిపోయింది. దీంతో స్థానికులు గుర్తించి తాళ్ల సాయంతో గంటపాటు శ్రమించి బయటకు తీయడంతో ఏఓ సురక్షితంగా బయటపడ్డారు. కాగా, రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో వరద నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక వర్షం వచ్చినప్పుడల్లా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.


నేడు టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభ

వైరా: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభ వైరాలో గురువారం జరగనుంది. ఈమేరకు ఏర్పాట్లు పూర్తిచేయగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, యూనియన్ రాష్ట్ర నాయకత్వం పాల్గొననుందని జిల్లా నాయకులు తెలిపారు. జిల్లా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

మెడికల్ కాలేజీకి 10మంది ప్రొఫెసర్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు పది మంది ప్రొఫెసర్లను కేటాయించారు. రాష్ట్రంలో పలువురు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారు. అందులో పది మందిని ఖమ్మం మెడికల్ కాలేజీకి కేటాయించారు. వీరిలో జనరల్ మెడిసిన్ ఇద్దరు, జనరల్ సర్జరీ, ఆప్తమాలజీ, రేడియాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, బయోకెమిస్ట్రీ, పీడియాట్రిక్ ఫిజియాలజీ, ఎస్‌పీఎం ఒక్కొక్కరు చొప్పున ఉండగా, వీరి కేటాయింపుతో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

జిల్లా వాసికి 'కోడి రామకృష్ణ' అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్

ఖమ్మంగాంధీచౌక్: 'వందే భారత్.. సేవ్ ఇండియా' సినిమా నిర్మించిన ఖమ్మంకు చెందిన మల్లం రమేష్‌ను కోడి రామకృష్ణ ఫిల్మ్ అవార్డు వరించింది. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన సినీ నటులు మురళీమోహన్, సుమన్, అల్లరి నరేష్, సీనియర్ దర్శకుడు రేలంగి నర్సింహారావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు వీరశంకర్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, నటీనటులు కవిత, నిహారిక, రాష్ట్ర భాషా సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. మతం ఏదైనటికీ దేశాన్ని ప్రేమించాలని, తీవ్రవాదం వైపు మొగ్గు చూపొద్దనే సంకేతంతో ఈ సినిమా నిర్మించినట్లు రామకృష్ణ తెలిపారు.


ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,400	4,800
ఏసీ మిర్చి	13,900	8,000
మిర్చి	9,200	5,800
పత్తి	7,950	6,000

– ఖమ్మం వ్యవసాయం


పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.17,463

దంత సేవలు అంతంతే...

- జిల్లా పెద్దాస్పత్రిలో వేధిస్తున్న పరికరాల కొరత
- సరైన సేవలు అందక 'ప్రైవేట్'కు బాధితులు
- గత ఏడాది మొత్తం 4,873 మందికే సాధారణ సేవలు



ఓపీలో పాడైపోయిన డెంటల్ చైర్

ఖమ్మంవైద్యవిభాగం: మానవ శరీరంలో అన్ని అవయవాల మాదిరిగానే దంతాలకు సైతం సమస్యలు వస్తుంటాయి. అయితే, దంత సమస్యలు త్వరగా నయం కావు. ఇందుకోసం వివిధ దశల్లో చికిత్స చేయించుకోవాల్సి ఉంటుంది. అలా జరగకపోతే ఇతర శారీరక సమస్యలు వచ్చే ప్రమాదముంది. ప్రధానంగా పరిశుభ్రత పాటించకపోతే దంత సమస్యలు వచ్చే అవకాశముండగా... జిల్లాలో దంత సమస్యతో బాధపడే వారికి ప్రత్యేకంగా మెరుగైన వైద్యం అందడం లేదు. ఖమ్మంలోని పెద్దాస్పత్రి దంత విభాగానికి నిరుపేదలే వస్తుండగా, వారికి నామమాత్రపు సేవలతోనే సరిపెడుతున్నారు. దీంతో పలువురు తప్పనిసరై ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు.

రోజుకు వంద మందికి పైగానే..

వయస్సుతో సంబంధం లేకుండా ఇటీవల దంత సమస్యతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. పెద్దాస్పత్రిలో ఓపీకి నిత్యం వివిధ సమస్యలతో 1,500మందికి వస్తుండగా, దంత సంబంధిత చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య వందకు పైగానే ఉంటుంది. కానీ ఇక్కడ సాధారణ చికిత్సలే తప్ప మెరుగైన వైద్యం అందకపోవడంతో నానాటికీ ఓపీ తగ్గుతోంది. గత ఏడాది మొత్తంగా పెద్దాస్పత్రిలోని దంత విభాగంలో 4,873 మందికే సేవలు అందాయి. ఆధునిక పరికరాలు లేకపోవడంతో పళ్లు తొలగించడం, కొత్తవి అమర్చడం వంటి మైనర్ చికిత్సలే జరుగుతున్నాయి. దీనికి తోడు ఇటీవల చికిత్సకు ఉపయోగించే కుర్చీ పాడవడంతో సేవలు మరింత మృగ్యమయ్యాయి.

ఓపీ సేవలతోనే సరి

పెద్దాస్పత్రిలోని దంత విభాగంలో అన్ని రకాల సేవలు అందక ఓపీ సేవలతో సరిపెడుతున్నారు. ఈ విభాగంలో రూట్‌కెనాల్, డీప్ క్లీనింగ్,దంతాల ఫిల్లింగ్, కాస్మోటిక్స్ తదితర చికిత్స అందించాల్సి ఉంటుంది. కానీ అందుకుసంబంధించి పరికరాలు సమకూర్చక.. నిపుణులైన వైద్యులు లేకపోవడంతో పెద్దాస్పత్రికి వచ్చేవారు నిరాశగా వెనుదిరుగుతున్నారు. దంత విభాగంలో ప్రస్తుతం ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. ఇక చైర్, మౌత్ మిర్రర్, డిజిటల్ ఎక్స్‌రే,ప్రొబ్, ఓరల్ కెమేరా, అల్ట్రాసోనిక్ స్కేలర్, పాలిషింగ్ బ్రష్ తదితర పరికరాలు లేకపోవడం.. చైర్ కూడా పాడవడంతో సేవలు నానాటికీ తీసికట్టు అన్న చందంగా మారాయి. సమస్యలతో వచ్చే వారితో మాట్లాడి నొప్పి నివారణ మాత్రలు రాసి పంపిస్తుండడంతో 10 – 15 మందికి మించి రావడం లేదు. అన్ని పరికరాలు సమకూర్చి ఎండీ స్థాయి వైద్యుడికి కేటాయిస్తే పేదలకు మెరుగైన వైద్యంఅందనున్నందున అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఈ ఏడాది ఓపీ వివరాలు

నెల	సంఖ్య
జనవరి	404
ఫిబ్రవరి	401
మార్చి	545
ఏప్రిల్	357
మే	456
జూన్	397
జూలై (ఇప్పటివరకు)	263

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం...



దంత సేవలు అందించే చైర్ పాడైన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో దీన్ని మరమ్మతు చేయించడమా కొత్తది కొనాలో నిర్ణయిస్తాం. ప్రస్తుతం సాధారణ చికిత్సలే అందుతున్నా, ఆధునిక పరికరాలు తెప్పించి మిగతా చికిత్సలు చేస్తాం. ఎండీ స్థాయి వైద్యుడిని కేటాయిస్తే శస్త్రచికిత్సలు అందించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ నరేందర్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్

ఖ్యాతి పెంచేలా 'ఎర్త్ సైన్సెస్'

- మూడేళ్లలో పూర్తి స్థాయి యూనివర్సిటీ నిర్మాణం
- ఈ విద్యా సంవత్సరం నుంచే యూజీ, పీజీ కోర్సులు ప్రారంభం
- సన్నాహక సమీక్షలో మంత్రి తుమ్మల, ఉన్నత విద్యాశాఖ అధికారులు



అధికారులు, ఎమ్మెల్యే కూనంనేనితో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: ఖనిజ సంపదకు నిలయమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ ఖ్యాతిని పెంచేలా ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ నిర్మిస్తున్నామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇది ప్రపంచంలోనే మొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా నిలుస్తుందని అన్నారు. యూనివర్సిటీలో ప్రవేశపెట్టాల్సిన కోర్సులు, మౌలిక వసతులు, భవనాల నిర్మాణం, నిధుల సమీకరణ తదితర అంశాలపై బుధవారం కొత్తగూడెంలోని యూనివర్సిటీ(ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ మైన్స్)లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వచ్చే నెలలో సీఎం రేవంత్‌రెడ్డి యూనివర్సిటీని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ విద్యాసంవత్సరం నుంచే బీఎస్సీ, ఎమ్మెస్సీలో జువాలజీ, ఎన్విరాన్‌మెంటల్ కోర్సులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అలాగే, నిర్మాణాల కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసి, వివిధ దేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను సందర్శించి అక్కడి మాదిరి సదుపాయాలు కల్పించడమే కాక కోర్సులు రూపొందించాలని తెలిపారు. యూనివర్సిటీకి మూడేళ్లలో శాశ్వత భవనాలు, అవసరమైన వసతులు కల్పిస్తామని, ఈ మేరకు నిధులు కేటాయించేలా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని తుమ్మల చెప్పారు.

మూడేళ్లలో మొత్తం కోర్సులు..

విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచి యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు మొదలవుతాయని, రాబోయే మూడేళ్లలో అన్ని కోర్సులు అందుబాటులోకి తెస్తామని అన్నారు. భూమిపై అవగాహన, భూమికి సంబంధించి అన్ని పరిశోధనల కోర్సులతో విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన మాట్లాడుతూ.. డాక్టర్ మన్మోహన్ సింగ్ లాంటి గొప్ప వ్యక్తి పేరుతో ఏర్పాటైన ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. శ్రీరాముడు కాలు మోపిన ఈ ప్రాంతంలో అద్భుత యూనివర్సిటీ స్థాపించడం సంతోషకమరని చెప్పారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడగా రాష్ట్ర ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి, ఉన్నత విద్యామండలి సెక్రటరీ శ్రీరామ్ వెంకటేష్, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్శిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రామచంద్రం, రూసా ప్రతినిధి సౌందర్యజోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ రైతులకు పరిహారం చెల్లించాలి



రైతులతో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

మధిర: నాగపూర్– అమరావతి జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న అసలైన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిర్వాసితుల భూములను బుధవారం పరిశీలించిన ఆయన వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు కేంద్రప్రభుత్వం న్యాయమైన పరిహారం మంజూరు చేసినా, రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్యంతో వక్ఫ్‌బోర్డుకు జమ అయిందని తెలిపారు. మాటూరు రెవెన్యూ పరిధిలో సుమారు 200ఎకరాల భూమిని రైతులు సాగు చేసుకుంటూ పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగి ఉన్నారన్నారు. అయితే, ధరణి పోర్టల్‌లో లోపాల కారణంగా అవి వక్ఫ్ బోర్డు భూములుగా నమోదు కావడంతో రైతులు నష్టపోయారని తెలిపారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డులు సరిచేయించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, నాయకులు శివరాజు సుమంత్, మర్సకట్ల స్వర్ణాకర్, పాపట్ల రమేష్, బియ్యవరపు రామకృష్ణ, సాయిరాం, శంకర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ బిజినెస్!



గొడుగు పరిశీలిస్తున్న వ్యక్తి

వర్షం వస్తే గొడుగులు.. చలికాలంలో స్వెటర్లు అమ్మితేనే వ్యాపారులకు ఎంతో కొంత లాభం ఉంటుంది. ఇదేక్రమాన ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కొందరు గొడుగులు, రెయిన్ కోట్లు అమ్ముతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట స్టాళ్లు ఏర్పాటుచేయగా విక్రయాలు జోరుగా సాగాయి. ఇక వర్షంలో బయటకు వచ్చిన వారు చల్లటి వాతావరణంతో అప్పటికప్పుడే కాల్చి అమ్ముతున్న మొక్కజొన్న కంకులు కొనుగోలు చేయడం కనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



రెయిన్ కోట్, ప్యాంట్ పరిశీలిస్తూ...



కంకులు కాలుస్తున్న చిరువ్యాపారి

ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరనే ఆత్మహత్య

పండితాపురంలో జంట బలవన్మరణంపై కేసు నమోదు

కామేపల్లి: ఇద్దరికీ ఒకే గ్రామం, పక్క పక్కనే ఇళ్లు.. పాఠశాల స్థాయి నుంచి కలిసి చదువుకున్న ఇద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారింది. అయితే, వేర్వేరు కులాలు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించరని.. ఆపై విడిపోయి బతకడం కష్టమని భావించి బలవన్మరణానికి పాల్పడ్డారు. కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన బండి లక్ష్మీనర్సు–ఉపేంద్ర దంపతుల మూడో కుమార్తె హారిక (20) పదో తరగతి తర్వాత చదువు మానేసి కూలీ పనులకు వెళ్తోంది. అదే గ్రామానికి చెందిన గాడిపల్లి సారయ్య–రజిత పెద్ద కుమారుడు శ్రీకాంత్(23) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా కొంత కాలం నుంచి ప్రేమించుకుంటున్నారు. కానీ పెళ్లికి పెద్దలు అంగీకరించరనే భావనతో హారిక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. దీంతో ఆమె లేకుండా తాను బతకలేనంటూ పురుగుల మందు తాగిన శ్రీకాంత్, ఆపై చనిపోతానో లేదోనన్న ఆవేదనతో గ్రామ శివారు మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుల కుటుంబీకులు బుధవారం వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేయగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అప్పగించినట్లు ఎస్సైసాయికుమార్ తెలిపారు. కాగా, గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ విషయం తెలియడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద హారిక, శ్రీకాంత్ మృతదేహాలకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళులర్పించారు. రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

16మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సత్తుపల్లి: సత్తుపల్లి మండలంలోని వివిధ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 16మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వీరినుంచి రూ.13,250 నగదుస్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రుద్రాక్షపల్లి, రేజర్లలో ఎనిమిది మంది చొప్పున అరెస్ట్ చేశామని సీఐ టి.శ్రీహరి తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

సత్తుపల్లి: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సత్తుపల్లి మండలం గంగారం వద్ద సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ప్రదీప్ తెలిపారు. ఏపీలోఇ కొవ్వూరు రేవు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈమేరకు టిప్పర్ డ్రైవర్ కక్రి కార్తీక్, యజమానులు నల్లరాజు, ఎర్రంశెట్టి రాజశేఖర్, ఇసుక అమ్ముతున్న గంగారం వాసి బండారు రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రదీప్ తెలిపారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాలు

సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సురేష్, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం పోరాడేలా ఇటీవల జరిగిన పార్టీ జిల్లా మహాసభల్లో నిర్ణయించినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా పాలకవర్గాలు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాట కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శి, సహాయ కార్యదర్శితో పాటు పార్టీ కోశాధికారిగా కార్యాలయ కార్యదర్శి కె.శ్రీనివాస్, 91 మందితో కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. అలాగే, 38 తీర్మానాలను ఆమోదించడమే కాక వీటి అమలుకు కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. హైవేల నిర్మాణంలో నిర్వాసితులకు పరిహారం, ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా నిర్ణయించినట్లు తెలిపారు. కాగా, జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చేసే ఆందోళనకు మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, బీ.జీ.క్లెమెంట్, తాటి వెంకటేశ్వరరావు, పుచ్చకాయల కమలాకర్, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పక్కింటి గెట్టు వివాదం

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి



శెట్టి లక్ష్మీనారాయణ (ఫైల్)

తల్లాడ: స్థలం గెట్టు విషయమై రెండు కుటుంబాలు ఘర్షణ పడుతుండగా.. ఒకరు సమీపంలోని వారిని దూషించడంతో ఇదేమిటని ఓ మహిళ ప్రశ్నించగా దాడి చేశారు. ఆమె కుమారుడు చేరుకుని ఆరా తీయగా ఆయనపైనా దాడి చేయడంతో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఇది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తల్లాడ మండలంలోని అన్నారుగూడెంకు చెందిన భట్టు మంగమ్మ, సుంకర అరుణ ఇంటి మధ్య స్థలం హద్దులపై గొడవ జరుగుతోంది. ఈనెల 19న మళ్లీ గొడవ జరగగా అరుణ చుట్టుపక్కల వాళ్లను కూడా కలిపి దుర్భాషలాడుతుండటంతో శెట్టి కమలమ్మ ప్రశ్నించింది. ఈక్రమంలో కమలమ్మను అరుణ, ఆమె కుమారుడు శివ కొట్టగా కమలమ్మ తన కుమారుడు లక్ష్మీనారాయణ(38)కు సమాచారం ఇచ్చింది. దీంతో ఆయన వచ్చి గొడవ పడడంతో శివ ఇనుపరాడ్‌తో లక్ష్మీనారాయణ తలపై బలంగా మోదాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఆయనను ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈమేరకు వైరా సీఐ సాగర్ బుధవారం గ్రామంలో విచారణ చేపట్టగా, గొడవలు జరగకుండా తల్లాడ ఎస్‌ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యాన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, సమీపంలోని రెండు కుటుంబాలు గొడవ పడుతూ తమను దూషించడంతో ఇదేమిటని అడిగిన పాపానికి శెట్టి కమలమ్మ దాడికి గురవడమే కాక కుమారుడు లక్ష్మీనారాయణను సైతం కోల్పోవడం ఆమె కుటుంబంలో విషాదాన్ని నింపింది. మృతుడు లక్ష్మీనారా యణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి

విద్యాసంస్థల బంద్‌లో నాయకులు



ఖమ్మంలో నిరసన తెలుపుకున్న నాయకులు, విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని.. వసతులు కల్పించకపోవడంతో పాటు ఉపాధ్యాయుల కొరత ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుడుం ప్రవీణ్, లక్ష్మణ్, మస్తాన్ పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన బుధవారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన వసతులు లేక తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అవలంబిస్తుండడం సరికాదన్నారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మధు మనోజ్, గోపి, వినోద్, శ్రీనాథ్, లోకేష్, వీరేందర్, అంజలి, సింధు, సందీప్, మహేష్, అనిల్, యశ్వంత్, లక్ష్మీనారాయణ, అజయ్, వివేక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్ర హోమం

పాల్వంచరూరల్ : పాల్వంచ మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రుద్రహోమం, శివాలయంలో నందీశ్వరుడుకి అభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాల నడుమ స్వామివారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజ గావించి రుద్రహోమం, చివరకు పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. హోమంలో పాల్గొన్న వారికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ విషయంలో అప్రమత్తత

ఖమ్మంవ్యవసాయం: వర్షాల నేపథ్యాన విద్యుత్ వాడకంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి సూచించారు. అలాగే, రైతులు వ్యవసాయ క్షేత్రాల వద్ద పంపుసెట్ల మరమ్మతు సొంతంగా చేయొద్దని తెలిపారు. నిపుణులైన ఎలక్ట్రీషియన్లతో చేయించాలని, తద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని వెల్లడించారు. అంతేకాక ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగినా, వేలాడుతున్నా టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని ఎస్ఈ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో కొణిజర్ల మండలం తుమ్మలపల్లికి చెందిన ఇజ్జగిరి జనార్దన్‌కు నెల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మూడో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి వి.మాధవి బుధవారం తీర్పు చెప్పారు.

కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాంపూడి రోశయ్య వద్ద జనార్దన్ 2019 ఏప్రిల్‌లో రూ.7లక్షల అప్పు తీసుకున్నాడు. ఆపై 2020 మార్చిలో రూ.7లక్షలకు చెక్కు జారీ చేశాడు. అయితే, ఆయన ఖాతాలో సరిపడా నగదు లేక చెక్కు బౌన్స్ అయింది. దీంతో న్యాయవాది ద్వారా రోశయ్య లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. కేసు విచారణ అనంతరం జనార్దన్‌కు జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

పాలేరు ఏటిలో యువకుడి గల్లంతు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి గ్రామానికి చెందిన ఎస్.ఆదిత్య(19) పాలేరు ఏటిలో గల్లంతైనట్లు తెలిసింది. ఆయన బుధవారం సాయంత్రం గ్రామంలోని పాలేరు ఏటి వద్దకు వెళ్లగా తిరిగి రాలేదు. దీంతో నీటి ఉధృతిలో గల్లంతై ఉంటాడనే భావనతో కుటుంబీకులు, స్థానికులు రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదని సమాచారం. అయితే, ఆయన ఏటి వద్దకు ఎందుకు వెళ్లాడు, చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు పడ్డాడా, ఎవరైనా కూలీ పనులకు తీసుకెళ్లారా అన్నది తెలియాల్సిఉంది.

వృద్ధుడికి సాయంగా వెళ్తూ మృతి



రాంబాబు (ఫైల్)

ఖమ్మంక్రైం: ఇంటి సమీపాన ఉండే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతుండగా కుమారుడి వద్ద దిగబెట్టేందుకు బయలుదేరిన వ్యక్తి రైలునుంచి జారిపడి మృతి చెందిన ఘటన ఇది. ఇందుకు సంబంధించి వివరాలు... ఏపీలోని భీమవరానికి చెందిన సుతారీ మేస్త్రీ తామడ రాంబాబు(33) భార్య, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నాడు. ఆయన ఇంటి సమీపాన నివసించే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లో ఉండే ఆయనకుమారుడు తన వద్దకు తీసుకురావాలని కోరాడు. దీంతో రాంబాబు వృద్ధుడిని తీసుకుని బుధవారం రైలులో వెళ్తుండగా ఖమ్మం వెంకటగిరి గేట్ వద్ద బాత్ రూమ్‌కు వెళ్లే క్రమాన ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలతో రాంబాబు మృతి చెందగా జీఆర్పీ పోలీసులు ఆయన ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా వృద్ధుడి కుమారుడికి సమాచారం ఇచ్చారు. ఆపై మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. ఇదిలా ఉండగా రాంబాబు మృతి సమాచారం తెలియని వృద్ధుడు ఎక్కడ దిగాడో సమాచారం అందక ఆయన కుమారుడు హైదరాబాద్‌లో వెతుకున్నట్లు తెలిసింది.